క్లుప్తంగా

ఎర్రపెంటలో ఫీవర్ సర్వే



లింగాల: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఎర్రపెంటలో సోమవారం వైద్య సిబ్బంది ఇంటింటికి తిరిగి ఫీవర్ సర్వేను నిర్వహించారు. వైద్యాధికారిణి శిరీష సమక్షంలో వైద్య సిబ్బంది పెంటలో జ్వర పీడితులను గుర్తించారు. పెంటలో ఇండ్ల మధ్య ఉన్న మురుగు గుంటలపై బ్లీచింగ్ పౌడర్, మందులను పిచికారి చేశారు. అనంతరం జ్వరాల బారిన పడిన చెంచులకు వైద్య సేవలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మలేరియా డివిజన అధికారి బిక్‌లాల్, ఎంపీహెచ్‌ఏ రాంచందర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మారేడుమాన్ దిన్నెలో గ్రామసభ

పెద్దకొత్తపల్లి: మండలంలోని మారేడుమాను దిన్నెలో సోమవారం గ్రామసభ నిర్వహించారు. గ్రామసభలో మాజీ జెడ్పీటీసీ మేకల గౌరవమ్మ పాల్గొని మాట్లాడారు. ఆరుగ్యారంటీ పథకాలు అర్హులందరికీ అందుతాయన్నారు. కార్యక్రమంలో డీటీ రమేష్‌నాయక్, ఏఓ శిరీష, ఏఈఓ మల్లేష్, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, ఫీల్డ్ అసిస్టెంట్ నాగరాజు పాల్గొన్నారు.

తల్లి, కూతురు అదృశ్యం: కేసు నమోదు

తిమ్మాజిపేట: తల్లికూతురు అదృశ్యమైన ఘటన సోమవారం చోటుచేసుకుంది. ఉమెన్ ఏఎస్‌ఐ ప్రిసిల్లా తెలిపిన వివరాల ప్రకారం నాలుగేళ్ల కిందట సరోజకు, హర్యకు వివాహం అయ్యింది. వీరికి మూడేళ్ల కుమారుడు, రెండేళ్ల కూతురు ఉంది. ఈనెల 5న సాయంత్రం ఫోన్ ఎక్కువగా మాట్లాడుతుండగా భార్యను భర్త మందలించాడు. 6న భార్య సరోజ రెండేళ్ల కూతురును తీసుకొని బయటకు వెళ్లింది. ఎంతకీ తిరిగి రాకపోవడంతో ఎంత వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

ఆర్థికసాయం అందజేత

తిమ్మాజిపేట: మండలంలోని మారేపల్లి గ్రామానికి చెందిన బెస్త చిన్నయ్య అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. మాజీ వార్డు సభ్యులు అన్నమ్మ, మనోహర్ బాధిత కుటుంబ సభ్యులకు రూ.5వేలు అందించారు.

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని అంబేడ్కర్ నగర్ కాలనీకి చెందిన మబ్బు సైదమ్మ అనారోగ్యంతో సోమవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు బావాండ్ల మధు బాధిత కుటుంబానికి రూ.5000 ల ఆర్థికసాయం అందజేశారు. అదే విధంగా ఎడ్మ ఎడమ కిష్టారెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ద్వారా మాజీ మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం రూ.5000 ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో మబ్బు సాయిలు, గోపాల్, రామకృష్ణ, నేరటి శేఖర్, శ్రీకాంత్, రాజు తదితరులు పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యాలపై దృష్టి సారించండి

పాన్‌గల్: ఉపాధ్యాయులు విద్యార్థుల సామర్థ్యాల పెంపుపై దృష్టి సారించాలని ఎంఈఓ శ్రీనివాసులు హెచ్‌ఎంలకు సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలల్లో ఆయా పాఠశాలల హెచ్‌ఎంల సమావేశంలో ఆయన మాట్లాడారు. అందరికృషితో మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడం అభినందనీయమన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో ఫౌండేషనల్ అండ్ లిటరసీ న్యూమరసి ప్రోగ్రామ్, ఉన్నత పాఠశాలల్లో లర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రామ్ విజయవంతంగా నిర్వహించాలన్నారు. పాఠశాలల వారీగా అందజేసిన పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, వర్క్‌బుక్స్, యూనిఫామ్స్ వివరాలపై ఆరా తీశారు. సమావేశంలో హెచ్‌ఎంలు, సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం



వెల్దండ: మండలంలోని కొట్రలో లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవాలయ నిర్మాణానికి సోమవారం జిల్లా కాంగ్రెస్ నాయకుడు కాయితి ఆశాదీప్‌రెడ్డి రూ.1,00,116లు విరాళంగా ఉత్సవ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరు దైవభక్తితో మెలగాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రాములు, నాయకులు అల్లాజీ, శ్రీను, జంగయ్య, శివ తదితరులు ఉన్నారు.

శిథిలావస్థలో పాఠశాల భవనాలు

- పెచ్చులూడుతున్న స్లాబ్‌లు
- అసంపూర్తిగా తరగతి నిర్మాణం
- పట్టించుకోని అధికారులు



పై కప్పు పెచ్చులూడిన ఎంగంపల్లి పాఠశాల



పిల్లర్లకే పరిమితమైన ఇంద్రకల్ పాఠశాల భవనం

తాడూరు: ప్రభుత్వ బడుల్లో మౌలిక వసతుల కల్పిస్తామని ప్రజాప్రతినిధుల హామీలు నీటిమీద రాతలాగేనే మిగిలింది. కొన్ని పాఠశాలలు శిథిలావస్థలకు చేరుకున్నాయి. మరికొన్ని పాఠశాలలో భవనాల పైకప్పు పెచ్చులూడుతున్నాయి. పలు గ్రామాల్లో తరగతి గదుల నిర్మాణాలు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని పిల్లలను పాఠశాలకు పంపించేందుకు తల్లిదండ్రులు వెనకడుగు వేస్తున్నారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా భవనాల నిర్మాణం దేవుడెరుగు కాని కనీస మరమ్మతుకు కూడా నోచుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

పొంచి ఉన్న ప్రమాదం

మండలంలో నాగదేవపల్లి పాఠశాల భవనం దాదాపు ఐదేళ్ల కిందట గోడలు కూలి శిథిలావస్థకు చేరుకుంది. అయిన రెండేళ్ల పాటు అలాగే పాఠశాలను కొనసాగించారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రస్తుతం విద్యార్థులను తల్లిదండ్రులు పంపడం లేదు. కొత్త భవనం నిర్మిస్తేనే పాఠశాలకు పిల్లలను పంపుతామని అనడంతో అక్కడ పని చేసే ఉపాధ్యాయుడు ఆంజనేయులును కూడా మండలంలోని అల్లాపూర్ పాఠశాలకు డిప్యూటేషన్‌పై వెళ్లారు. అదే విధంగా ఎంగంపల్లి పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది. ఈ పాఠశాలకు కూడా విద్యార్థులు వెళ్లడం లేదు. మండలంలోని ఇంద్రకల్‌లో నాలుగేళ్ల కిందట రూ.14 లక్షలతో మన ఊరు మనబడి పథకంలో భాగంగా నిర్మాణ పనులు చేపట్టారు. పిల్లర్ల వరకు నిర్మాణం కొనసాగి పనులను నిలిపి వేశారు. తాడూరు పాఠశాల భవనం పునాది వరకే పరిమితం అయ్యింది. నాగదేవపల్లి, ఎంగంపల్లి భవనాల నిర్మాణాలకు ఎటువంటి నిధులు మంజూరు చేయలేదు.

మండలంలో విద్యార్థుల వివరాలు

1-5వ తరగతి వరకు 1210 మంది విద్యార్థులు చదువుతున్నారు. 6-10 వరకు 1945, మొత్తం విద్యార్థులు 3155 విద్యను అభ్యసిస్తున్నారు. భవనాలు సరిగ్గా లేక పోవడంతో పాఠశాలకు వెళ్లేందుకు పిల్లలు ఆసక్తి చూపడం లేదు. కాని అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఇలాగే అధికారుల తీరు ఉంటే ఉన్న విద్యార్థులు కూడా ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లే అవకాశం ఉంది. నూతన భవనాలు నిర్మించాలని కోరుతున్నారు.

డిప్యుటేషన్‌పై పనిచేస్తున్నా..



నాగదేవపల్లి పాఠశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. దీంతో విద్యార్థులను తల్లిదండ్రులు పాఠశాలకు పంపించడం లేదు. ప్రస్తుతం అల్లాపూర్ పాఠశాలలో డిప్యుటేషన్‌పై పని చేస్తున్నా. కొత్త భవనాన్ని నిర్మిస్తేనే పాఠశాలకు పంపుతామని తల్లిదండ్రులు చెబుతున్నారు.

– ఆంజనేయులు, ఉపాధ్యాయుడు, అల్లాపూర్

నివేదికలు పంపించాం



మండలంలోని ఆయా పాఠశాలలను పరిశీలిచాం. శిథిలావస్థలో ఉన్న పాఠశాలలను గుర్తించి నివేదిక రూపొందించాం. కొత్త భవనాల నిర్మాణం కోసం ఉన్నతాధికారులకు పూర్తి వివరాలతో కూడిన నివేదికను పంపించాం. నిధులు మంజూరైతే కొత్త భవనాల నిర్మాణాలకు చర్యలు తీసుకుంటాం.

– శ్రీనివాస్‌రెడ్డి, ఎంఈఓ, తాడూరు

స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి



నాగర్‌కర్నూల్ రూరల్: ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను తక్షణమే విడుదల చేయాలని కోరుతూ సోమవారం కలెక్టర్ ఏఓ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి తారాసింగ్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు భరత్,కుమార్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కల్వకుర్తి రూరల్: స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్ అధ్యక్షుడు జమాలుద్దీన్ డిమాండ్ చేశారు. సోమవారం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద కాంగ్రెస్ నాయకుడు ఆనందకుమార్కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జమాలుద్దీన్ మాట్లాడుతూ ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు సర్టిఫికెట్ల కోసం ఇబ్బందులు పడుతున్నారన్నారు. పై చదువులకు వెళ్లే వారికి ఫీజులు చెల్లించి సర్టిఫికెట్లు తీసుకెళ్లాలని కళాశాలల యాజమాన్యాలు ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రామరాజు, ఇమ్రాన్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా దుస్తుల వితరణ

ఉప్పునుంతల: మండలంలోని వెల్టూరు జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులకు సోమవారం గ్రామ మాజీ సర్పంచు గున్నమోని లింగమయ్యయాదవ్ క్రీడా దుస్తులను ఉచితంగా అందజేశారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ ఆటల్లో ప్రతిభ కనబరిచే 40 మంది విద్యార్థులకు దుస్తులను అందజేశారు. విద్యారులు చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించాలన్నారు. హెచ్‌ఎం రవిశేఖర్, గ్రామ నాయకులు మల్లయ్య, వేణుగోపాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బాలరాజు, బాల్‌రెడ్డి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యూరియా కొరత సృష్టిస్తే చర్యలు

పాన్‌గల్: యూరియా కొరత సృష్టిస్తే వారిపై చర్యలు తప్పవని ఏఓ రాజవర్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయం, బుసిరెడ్డిపల్లిలో అగ్రోదుకాణాన్ని తనిఖీచేసి యూరియా నిల్వలను ఆయన పరిశీలించారు. సింగిల్‌విండో కార్యాలయానికి ఇప్పటివరకు 310 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందని, కార్యాలయంలో 162 మెట్రిక్ టన్నుల అందుబాటులో ఉందని తెలిపారు. రైతులకు ఎలాంటి కొరత లేకుండా యూరియాను సరఫరా చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో పాము కలకలం



తాడూరు: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం పాము కలకలం రేపింది. ఉదయం 11 గంటల సమయంలో ఆర్‌ఐలు సురేష్, సల్మాన్‌లతో పాటు మిగతా సిబ్బంది విధుల్లో నిమగ్నమైన సమయంలో బీరువా వెనుక భాగం నుంచి శబ్దం రావడంతో వారు తిరిగి చూడగా పాము కనిపించింది. దీంతో ఒక్కసారిగా తమ కూర్చీలను వదిలి బయటకు పరిగెత్తారు.స్థానికులు పామును పట్టుకున్నారు. దాదాపు 5–6 అడుగుల ఉంది. జెర్రిపోతుగా గుర్తించి పొలాల వైపు వదిలివేశారు. దీంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి

నాగర్‌కర్నూల్ రూరల్: ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని లయన్స్ మాజీ గవర్నర్ రాధాకృష్ణ కోరారు. లయన్స్ సేవా వారోత్సవాల సందర్భంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఉచిత మధుమేహ వ్యాధి పరీక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. సుమారు 200 మంది షుగర్ పరీక్షలు నిర్వహించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, కార్యదర్శి సురేష్‌కుమార్, హాకిమ్ విశ్వప్రసాద్, రాజవర్ధన్‌రెడ్డి, దర్శి రాజయ్య, రామకృష్ణారెడ్డి, పాల్గొన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో ఇద్దరికి జైలు శిక్ష

నాగర్‌కర్నూల్ క్రైం: డ్రంకెన్ డ్రైవలో పట్టుబడిన ఇద్దరు వ్యక్తులకు సోమవారం జైలు శిక్ష విధించినట్లు ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపారు. జిల్లా కేంద్రంలో పోలీసుల తనిఖీలలో ఎండబెట్ల గ్రామానికి చెందిన మౌలాల్, మంగనూరు గ్రామానికి చెందిన తిరుపతి మద్యం తాగి పట్టుబడ్డారు. ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ శృతిదూత ఎదుట వారిని హాజరు పరచగా విచారించి మౌలాల్‌కు మూడురోజులు, తిరుపతికి ఒక రోజు జైలు శిక్ష విధిస్తు తీర్పు ఇచ్చినట్లు తెలిపారు.

తిమ్మాజిపేట: డ్రంకెన్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు శిక్ష విధించినట్లు ఏఎస్‌ఐ ప్రిసిల్లా, కానిస్టేబుల్ మంగ్లనాయక్ తెలిపారు. డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన ఎదిరేపల్లికి చెందిన ఎల్లయ్యను, వట్టెం గ్రామానికి చెందిన నీళ్ల శేఖర్‌ను సోమవారం కోర్టులో హాజరు పర్చగా న్యాయమూర్తి నిందితుడు ఎల్లయ్యకు నాలుగు రోజులు, శేఖర్‌కు రెండు రోజులు జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

యువకుడిపై దాడి: కేసు నమోదు

కొల్లాపూర్ రూరల్: మండలంలోని చౌటబెట్లలో ఆదివారం రాత్రి రచ్చకట్ట వద్ద యువకులు ఘర్షణ పడ్డారు. ఎస్‌ఐ హృషికేష్ వివరాల ప్రకారం ఆదివారం రాత్రి గ్రామంలో ఉన్న జాతీయ నాయకుల విగ్రహాలు ఏర్పాటు చేసిన మెట్లపైని గణేష్ చెప్పులతో ఎక్కి పీర్లను ఫోన్ లో చిత్రీకరిస్తున్నాడు. పక్కనే ఉన్న మిత్రుడు అనిల్ చెప్పులు వదలాలని సూచించాడు. ఈ విషయమై ఒకరికొకరు అసభ్యపదజాలంతో తిట్టుకున్నారు. గణేష్ సోదరుడు శివుడు చేతితో అనిల్‌ను కొట్టాడు. ఇది మనసులో పెట్టుకొని గణేష్‌పై అనిల్ కత్తితో దాడి చేశాడు. ఈ ఘటనలో గణేష్ కు స్వల్ప గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

రిమాండ్‌కు తరలింపు

వెల్దండ: మండలంలోని రాచూర్ గ్రామానికి చెందిన మాడ్గుల సడుమంతు ఈ నెల 5న విజయవాడకు చెందిన చిలకమర్తి బాలసుబ్రమన్యంపై కత్తితో దాడిచేసి తీవ్రంగా గాయపరచడంతో సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి పూర్తి విచారణ చేసి నిందితుడిని సోమవారు రిమాండ్‌కు తరలించారు. బాలసుబ్రమన్యం హైదరాబాదులోని గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ప్రస్తుతం అతని ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్న వైద్యులు తెలిపారు.

సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ



పెద్దకొత్తపల్లి: మారేడుమాను దిన్నె గ్రామానికి చెందిన జీవులనాయక్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. సీఎం రిలీఫ్‌ఫండ్ కోసం దరఖాస్తు చేసుకోగా రూ.60 వేలు మంజూరయ్యాయి. ఈ మేరకు సోమవారం మాజీ జెడ్పీటీసీ మేకల గౌరవమ్మ లబ్ధిదారుడకి చెక్కు అందజేశారు. ముఖ్యమంత్రి సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో చంద్రయ్య, రాముడు, లక్ష్మణ్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీలతో కూడిన పదోన్నతులు చేపట్టాలి

కందనూలు: ఉపాధ్యాయులకు బదిలీలతో కూడిన పదోన్నతులు చేపట్టాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు మురళి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం నాగర్‌కర్నూల్ మండలంలోని కుమ్మెర, ఉయ్యాలవాడ, శ్రీపురం, తూడుకుర్తి పాఠశాలల్లో యూనియన్ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్‌ఏ, ఎస్జీటీలకు బదిలీలతో కూడిన పదోన్నతులు కల్పించాలన్నారు. అదే విధంగా 8 నెలల క్రితం సమగ్ర సర్వే చేసిన ఉపాధ్యాయులకు పారితోషికం చెల్లించడంతో పాటు పెండింగ్‌లో ఉన్న మెడికల్ బిల్లులు చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ఈశ్వర్, రాష్ట్ర కార్యదర్శి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

సేవలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న రాఘవేందర్ రెడ్డి

కల్వకుర్తి రూరల్: నియోజకవర్గంలో కంటి సమస్యలతో ఇబ్బంది పడుతున్న ప్రతి ఒక్కరు కంటి చికిత్స శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి అన్నారు. సోమవారం మూడోరోజు 700 మంది కంటి శిబిరానికి హాజరయ్యారు. 550 మందికి కంటి పరీక్షలను నిర్వహించి 350 మందికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. 30 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. కార్యక్రమంలో ఐక్యత ఫౌండేషన్ సభ్యులు రచ్చ శ్రీరాములు, యూసుఫ్, బాబా, మల్లయ్య, శ్రీపతి, శేఖర్, రవి, యాదయ్య, శ్రీను, నాగిల్ల శివ, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు



చారకొండలో ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

సాక్షి, నెట్‌వర్క్: నాగర్‌కర్నూల్ జిల్లాలోని పలు మండలాల్లో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డా.బీఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చారకొండలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కాసిం హజరై ఆ సంఘం జెండాను ఆవిష్కరించారు. కల్వకుర్తి, కొల్లాపూర్, వెల్దండ, పెద్దకొత్తపల్లిలో మంద కృష్ణ మాదిగ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేశారు. స్వీట్లను పంచిపెట్టారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి మబ్బు సాయన్న మాదిగ, బీజేపీ పట్టణ అధ్యక్షుడు బాబీ దేవ్, వివేకానంద, బీఆర్‌ఎస్, ఎమ్మార్పీఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజావాణిలో ఫిర్యాదుల పరిష్కారం



వెల్దండ: ప్రజావాణిలో ఫిర్యాదులు పరిష్కారం అవుతాయని డిప్యూటీ తహసీల్దార్ కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఆయా గ్రామాల ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కుప్పగండ్ల గ్రామానికి చెందిన బాలకిష్టయ్యగౌడ్ సర్వే నంబర్ 51లో 6 గుంటలు, సర్వే నంబర్ 49లో మరో 6 గుంటల భూమి కబ్జాకు గురైనట్లు ఫిర్యాదు చేశాడు. అనంతరం కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు ఉన్నారు.

క్రీడాకారుడికి స్వర్ణపతకం



కందనూలు: హనుమకొండ జిల్లాలోని జవహర్‌లాల్ నెహ్రూ అథ్లెటిక్స్ స్టేడియంలో సోమవారం నుంచి నిర్వహిస్తున్న 11వ తెలంగాణ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణానికి చెందిన రమావత్ శివరామకృష్ణ పాల్గొన్నాడు. లాంగ్ జంప్ అండర్–12 బాలుర విభాగంలో ప్రతిభకనబర్చి స్వర్ణ పతకం సాధించాడు. జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి స్వాములు జిల్లా అధ్యక్షుడు విజేందర్‌యాదవ్‌లు క్రీడాకారుడిని అభినందించారు.

కరపత్రాలు విడుదల



ఉప్పునుంతల: ఈనెల 9న నిర్వహించే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు సంబంధించిన కరపత్రాలను సోమవారం మండలకేంద్రలో హమాలీ సంఘం సీఐటీయూ ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల బాధ్యులు చింతల నాగరాజు మాట్లాడుతూ పెట్టుబడిదారుల ప్రయోజనం కోసం కార్మిక వర్గాన్ని బలిచ్చే 4 లేబర్ కోడ్స్‌ను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దశాబ్దాలపాటు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను, హక్కులను ప్రభుత్వాలు పూర్తిగా కాలరాస్తున్నాయన్నారు. దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రభుత్వాలకు తమ సత్తా చూపాలని ఆయన కోరారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



కోడేరు: విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని ఎంఈఓ భాస్కర్‌శర్మ హెచ్చరించారు. సోమవారం మండలంలోని రాజాపూర్ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలన్నారు. విద్యార్థులకు అర్థమయ్యేలా విద్యాబోధన చేయాలని సూచించారు. మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం గుడ్లు, పండ్లు అందించాలని కోరారు. కార్యక్రమంలో సీఆర్పీ నాగ్యానాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చైర్మన్‌కు సన్మానం

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో మార్కెట్ కమిటీ నూతన చైర్మన్ దండు నర్సింహను దేవునితిర్మాలపూర్ మాజీ సర్పంచ్ సత్యం, మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాసులు శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఆంజనేయులు, స్వామి, కాశలు, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో మొహర్రం సందడి



కొల్లాపూర్‌లో పీర్లను దర్శించుకుంటున్న నాయకులు

కొల్లాపూర్ రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో పీర్లకు వీడ్కోలు పలికారు. అంతకుముందు పురవీధుల గుండా ఊరేగించి నిమజ్జనానికి తరలించారు. మహిళలు బొడ్డెమ్మలు, అలయ్ –బలయ్ ఆడారు.

పీర్ల ఊరేగింపు

లింగాల: మండలంలోని అంబట్‌పల్లిలో పీర్లను ఊరేగించారు. కానుకలు, దట్టీలు సమర్పించి, పలువురు పలు రకాల వేషధారణలతో ఆకట్టుకున్నారు. డప్పు చప్పుళ్లు, కొలాటాలు, బొడ్డెమ్మల నడుమ ఊరేగింపు నిర్వహించి బావులలో నిమజ్జనం చేశారు.

ప్రత్యేక ప్రార్థనలు

ఉప్పునుంతల: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో పీర్ల చావిడీ వద్ద భక్తులు ప్రత్యేక ప్రార్థనలు చేసి కానుకలు సమర్పించారు. అలావు ఆడే కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామ పురవీధుల గుండా పీర్లను ఊరేగించి నిమజ్జనానికి తరలించారు.

దట్టీలు సమర్పణ

పెద్దకొత్తపల్లి: మొహర్రం సందర్భంగా పీర్లకు దట్టీలు సమర్పించారు. ఆయా గ్రామాల్లో పీర్లను భక్తుల ఇళ్ల వద్దకు వెళ్లి ఆశీర్వదించారు. పీర్లకు దట్టీలు, పూలు సమర్పించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

తాడూరులో..

తాడూరు: మండల కేంద్రంతో పాటు చర్లతిర్మలాపురం, గుట్టలపల్లి, అల్లాపూర్, పాపాగల్, సిర్సవాడ, ఐతోల్‌లో మొహర్రం వేడుకలు నిర్వహించారు.



కోడేరులో పీర్ల ఊరేగింపు

కోడేరు: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో మొహర్రం వేడుకలు సోమవారంతో ముగిశాయి. గత నెల 28న ప్రారంభమైన మొహర్రం వేడుకలు దాదాపు 10 రోజుల పాటు పీర్లచావిడీలో పీర్లు కొలువుదీరాయి. సోమవారం చివరి రోజు తెల్లవారుజామున 3 గంటలకు పీర్లను పురవీధుల గుండా తిప్పారు. కొందరు తలనీలాలు ఇచ్చి, గొర్రె పొటేళ్లను బలిఇచ్చారు. ఉదయం 11 గంటల ప్రాంతంలో ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఏబూజి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పీర్లను అలాయి చుట్టు తిప్పి సాయంత్రం వేళలో పీర్లను నిమజ్జనానికి తరలించారు. వేడుకలను చూసేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి తిలకించారు.



ఉప్పునుంతలలో ..



తాడూరులో